# పండుగ

ఆఫీసు నుంచి వస్తూనే వరండా మీద చెప్పులు కాలితోనే గోడవారకి గిరాటేసి వాలుకుర్చీలో కూలబడే వెంకట్రావ్ అలాకూలబడలేదు. ఒబ్బిడిగా చెప్పులు గోడ వారపెట్టి ఈలవేసుకుంటూ గదిలోకి వచ్చాడు.

అప్పటికే పద్మ చక్కగా ముస్తాబై ప్లేట్లో వేడివేడి ఉప్మా, బజ్జీ సర్దుతోంది.

''తొందరగా వచ్చేశారే !'' అంది ఆనందంగా.

''మరి రాకతప్పుతుందా ! ఎంత అదృష్టమో, నేను గేటు దగ్గరకు వచ్చేసరికే బస్సు ప్రత్యక్షమైంది. పదిహేను నిముషాలలో వచ్చేశా ! అయినా పద్దూ, మునపటి కంటె మన జీవితాలు మెరుగయ్యాయి సుమా ! ఊరకే ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ ఉండడం కూడా దృష్టిలోపమేమో ! – ఇవేనా పుట్టినరోజు స్పెషల్స్ !.... మరి....''

''ఆఁ..... మరీ, బరీ ఏం అక్కర్లే ! స్వీటు కూడా చేశా.... అన్నయ్య సరిగ్గా ఈ రోజుకి అందేటట్టు నాకు డబ్బు పంపించాడు. బట్టలు మార్చుకుంటారా ?.... ఏం అలా చూస్తున్నారు ! బొట్టు సైజు మారిందా ?''

''లేదు... ఏయ్ ట్యూబ్‌లైట్... పద్దూ, నువ్ రోజూ ఇలాగే ఎందుకు ఉండకూడదు ! రోజూ పుట్టినరోజే అనుకోవచ్చుగా !''

''అవన్నీ తర్వాత కాని.... పావు తక్కువ ఆరయిపోతోంది.... ఆటోలో అయితే పదినిముషాలలో వెళ్లిపోవచ్చు !''

''కోవెలకా ?''

''అబ్బ ! కోవెల ఏమిటండీ ? చెప్పాగా సినిమాకి వెళదామని !''

''చెప్పావనుకో ! మరి... అంతకంటె సుఖమైనది... సరదా ఐనదీ.... మంచిదీ.... అలా అలా బజార్లో తిరిగి... మీ అన్నయ్య పంపిన డబ్బుతో చీర కొనుక్కుని..... ఏ హోటల్లోనో భోజనం చేసి దర్జాగా తొమ్మిదింటికి ఇంటికి వచ్చి....'' వెంకట్రావ్ కళ్లు తెరిచే కలల లోకం లోకి వెళుతున్నట్టు అన్నాడు.

''చాల్లెండి ! నాకు చీరకొంటానంటే మురిసిపోతాననుకుంటున్నారు. నాకు కావలసినన్ని చీరలున్నాయ్ కాని... ఈరోజు హాయిగా, హుషారుగా..... నేను చెప్పినట్లు సినిమాకెళ్లి అటునుంచి ఏ హోటల్లోనో ఇంత తిని పదయ్యాక ఇంటికొద్దాం ! ఎలాగూ బయటికి వెళుతున్నాం కాబట్టి సినిమాకే..''

''అది కాదోయ్ ! సినిమాకి వెళ్లడానికి టైమ్ లేదు... ఆ వెధవ క్యూలూ అవీ నేనుపడిచావలేను... నాకు ఇవాళ ఇంక్రిమెంట్ వచ్చింది. అందుకే తొందరగా వచ్చేశా ? తీరా ఆఫీసు వాళ్లతో మామూలుగా వచ్చాననుకో... ఎరియర్స్ వచ్చాయని నీ పుట్టినరోజని చెప్పినా వినకుండా, అలా అలా హోటల్‌కు తీసుకెళ్లి కడుపునిండా తిని బిల్లు నాచేతికిచ్చేస్తారు... ఓ అరగంట పర్మిషన్ పెట్టి, వాళ్ల కంటబడకుండా ఇలా వచ్చేశా ! డబ్బు వృథా చెయ్యడమెందుకు ఇవాళ చీర... రేపు సినిమా. సరేనా ?

''కాదు ! ఇవాళ సినిమా, రేపు చీర... చీర మీద నాకులేని మోజు మీకెందుకండీ ! ఇంకా

తినడం పూర్తికాలే ? అయ్యయ్యో ! టైమ్ అయిపోయింది ! ఈరోజు పత్రిక చూశా, ఇల్లాలు ప్రియురాలూ మాంచి పసందుగా ఉందట....''

'' ఇల్లాలూ ప్రియురాలూ ఒకరేనా ?''

'' ఏం ప్రశ్నండీ ! ఇద్దరూ ఒకరే అయితే మరి పసందేముందీ ?''

''నిజం?'' ఆశ్చర్యంగా ఓమారు ఆమెకేసి చూసి వెంకట్రావ్ అన్నాడు తాపీగా ''నువ్నా ప్రియురాలివే అనుకుంటున్నా !''

''ప్రియురాలినే !''

''మరినువ్ ఇల్లాలివి కదా !''

''అయితే ప్రియురాలిని కాకూడదా ?''

''కాదనేగా నువ్ అన్నది....''

''అవి కథల్లోనండీ !... లేవండి... కాఫీ చల్లారపెట్టి ఉంచా... తొందరగా తాగండి. వెనక గదికి తాళం వేశా... పట్టపగలే దొంగతనాలు.. ఇదిగో తాళం కప్ప... అరెరె జోళ్ళు మరచా... ఉండండి...''

''అబ్బ ఏమిటో హడావుడి ! ఇప్పుడు సినిమాకు వెళ్ళిపోతే రాత్రిపాలు...?''

''పక్కింటావిడ తీసుకుంటుంది !''

''అయితే సగం నీళ్లు ఖాయం. మీకు మనుషుల మీద నమ్మకం పోయింది సుమండీ : ఆవిడ నీళ్లు కలుపుతుందా ?''

'' నీ సినిమా పిచ్చి బాగుంది. ఆవిడ కలుపుతుందని నేనన్నానా ?''

''పదండి ! పదండి ! ఇంకా ఎనిమిది నిముషాలే వుంది''

తాళం వేసి ఇద్దరూ రోడ్డు మీద కొచ్చారు.

''అహో ! అదృష్టం అంటే ఇలా వుండాలండీ ! ఇల్లాలూ ప్రియురాలూ, తెలుసా ?'' పద్మ కంగారు చూసి ఆటో అబ్బాయి ముసిముసినవ్వులు నవ్వడం గమనించాడు వెంకట్రావ్. కిమ్ అనకుండా ఆటోలో ఆమెపక్క కూచున్నాడు.

సరిగ్గా ఆరు నిముషాలలో సినిమా హాలు ముందు ఆటో ఆగింది.

మీటరు చూడకుండానే ఐదు రూపాయల కాగితం అతని చేతిలో పెట్టింది పద్మ.

బయట కోలాహలం సినిమాహాలులో గంట గణగణ.

''బుకింగ్ క్లోజయి పావుగంట అయిపోయింది సార్. రెండు రెండంటే రెండు మీకోసమే అన్నట్టు వున్నయ్. తొందరగా తీసుకోండి సార్ ! మరో ఆటో వచ్చేస్తోంది సార్. ఒక్క ఇరవై''

'' ఇరవైయ్యా రెండు ఐదులు పదేగా !''

''అదేమిటి సార్ ఇందాక పాతికకి ఇచ్చా''

''అబ్బ ! ఏమిటయ్యా నీ గొణుగుడు ఇంద'' పద్మ ఇరవై కాగితం వాడి చేతిలో పెట్టి టికెట్లు తీసుకుంది.

హాల్లోకి నడచారిద్దరూ.

గేటు దగ్గర టిక్కెట్లు చూసాడు గేట్‌మన్.

''అమ్మా ! ఈ టిక్కెట్లు చెల్లవ్ ! ఇవి సినిమావాళ్లు అమ్మినవి కావు... బోర్డు బయట పెట్టాం

చూడలేదూ ! బయటకొన్న టిక్కెట్లు చెల్లవని రాశాం''

టిక్కెట్లు రెండూ ఆమెచేతిలో పెట్టి తలుపు దగ్గరగా వేసి లోపల వాళ్లకి ఇబ్బంది కలగకుండా కాబోలు కాస్త దూరంగా వచ్చాడు గేట్‌మన్.

''అరెరె ! దొంగరాస్కెల్ ! ఇర్వై పుచ్చుకున్నాడే ! మరి మీ ఆవరణలోనే ఇలా అమ్ముతుంటే ఎలా ఊరుకున్నారు ?'' పద్మ రివ్వున లేచిపోతోంది.

ఆమె గొంతుకలోగమకమో, మరేమిటో మేనేజర్ వచ్చేశాడు. వెనకాలే ఓ కానిస్టేబుల్.

''చూడండి... ఇవి బ్లాక్‌టిక్కెట్లు...'' మేనేజర్ అన్నాడు కొన్నవాళ్లదే తప్పంతా అన్నట్టు.

'' ఏవీ...'' పోలీసు టిక్కెట్లు తీసుకుంటూ అన్నాడు. ''పదండమ్మా స్టేషన్‌కి... భయంలేదులెండి! స్టేట్‌మెంట్ ఇచ్చి వెళుదురుగాని... వ్యాన్ ఉంది....''

వెంకట్రావ్ అవాక్కయిపోయాడు.

''మేము స్టేషన్‌కి రావడం పడదు.... ఈ రోజు ఈవిడ బర్త్‌డే !''

''అవన్నీ మాకెందుకు చెబుతారు సార్ ! స్టేషన్‌లో మీ ఇష్టం....''

''తప్పదంటారా ?'' వెంకట్రావ్ బిక్కమొగం వేశాడు.

''కొత్త జాయింటు కలెక్టరు బహునికార్సయిన మనిషి... ఇల్లాంటి దుర్మార్గుల్ని ఏరి వేయాలని స్ట్రిక్ట్ ఆర్డర్స్... పదండి....''

పద్మ బిక్క చచ్చిపోయింది.

''వెళ్లమ్మా.... మీకు రెండో ఆటకి నేను టిక్కెట్లు రిజర్వ్ చేసి ఉంచుతా... మాతో సహకరించండమ్మా... వెళ్లి ఆ వ్యక్తి ఆచూకీ స్టేషన్లో తెలియచేసి సత్‌పౌరుల్లా... మాతో సహకరించాలి మీరే...'' మేనేజర్ ఆమెను బ్రతిమాలాడు.

''సత్ పౌరులమే అనుకోండి... కాని... కాని.... ఈరోజు మా ఆవిడ పుట్టినరోజు... బొత్తిగా పుట్టినరోజు పూటా పోలీసుస్టేషనూ, గొడవా....''

''మేం రాం !'' పద్మ ఠక్కున చెప్పింది.

''అమ్మమ్మ ! మీరు అలా అనకూడదు. చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడిన వాళ్లమీద ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.... తీసుకుంటుంది.... బ్లాక్ టిక్కెట్లు కొనడం తప్పని మీకు తెలియదా ?''

వెంకట్రావ్‌కి చిరుచెమటపట్టింది. టిక్కెట్లు కొనడం నేరమని వెళ్లిన తమని.... ఇదెక్కడి గొడవా! ఆడమనిషితో ఈ రోజుల్లో చీకటయ్యాక పోలీసు స్టేషన్‌కి... తొందరగా ఆలోచించాడు.

''నేనయితే వస్తాననుకోండి !... ఆడవాళ్లు పేపర్లో చదువుతున్నాం కదా !... పద్మా... నువ్ ఇంటికి వెళ్లు నేను...''

''అదేం కుదరదు సార్ ! టిక్కెట్లు ఆవిడ చేతిలో ఉన్నాయి.... ఆవిడ కొన్నారు నేను చూశా...''

''అతను అమ్మడం చూశాకాని... అమ్మిన తరువాత అతనుకనపడలే... అమ్మనంతవరకు అతను దోషికాదు కదా... అతన్ని పట్టుకోడానికి చట్టం ఒప్పుకోదు... ఇద్దరూ రావాలి... రాకపోతే...''

మరేమీ వినదలచుకోలేదు వెంకట్రావ్.

''అబ్బే ! రామనడంలేదండీ ! మేం చట్టవిధేయులం... ఇలా ఒక్కసారి రండి....''

మేనేజర్ ఏదో పనిలో ఉన్నట్టు అటునుంచి పక్కగా వెళ్లాడు.

ఐదు నిముషాలలో చిక్కువిడిపోయింది.

''పదపోదాం !'' అంటూ వెంకట్రావ్ క్రిందకు ఆమెను తీసుకెళ్లాడు.

'' ఆటో ! పద,పద....'' ఆమెను ఎక్కించి ఆటోలో ఆమెపక్కనే కూచుని కాసేపు పోయాక రుమాలుతో చెమట తుడుచుకున్నాడు.

'' ఎలా వదిలించుకున్నారండీ ఈ పీడ ?''

'' ఏముంది నీ పుట్టినరోజు పండుగకు... కాదు దండుగకు మరో ఇరవై కలపాల్సి వచ్చింది.''

ఆటో రాజమార్గంలోకి మళ్లింది.

''వాడు నిజంగా పోలీసు వాడేనంటారా ?'' పద్మకి మరో విచారం మొదలైంది.

''కాకపోయినా ఆశ్చర్యమేముంది ? మనకి ఇది కనువిప్పు కలిగించేదేలే. మరెప్పుడూ ఇల్లాంటి తెలివితక్కువ పనిచెయ్యకూడదు... హోటల్‌లో భోజనం చేద్దామా ?

''అదొక్కటే తక్కువ ఈ మొహాలకి !... రెండు దుంపలు వేయించి పిడికెడు బియ్యం పడేస్తా...'' ఉస్సురని నిట్టూర్చింది పద్మ....

''మరీ డీలా అయిపోకు పద్మా... సినిమా చూడడానికి వచ్చావ్... సినిమాలోలా నటించి... హీరోయిన్‌గా... పోలీసుల చేతిలోనుంచి తప్పుకున్నాం. అదెంతకాదు ! అందుకే ఆటోలో హోటల్ భోజనం కాయం...''

పద్మ దండగ గురించే ఆలోచిస్తోంది.

**స్వాతి సపరివార పత్రిక**

2-11-84